క్లుప్తంగా

పొరపాట్లకు తావులేకుండా రీసర్వే చేపట్టాలి



కడిమెట్ల గ్రామంలో రీసర్వేపై రైతుతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరుటౌన్: భూముల రీ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో రీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వేపై రైతులతో మాట్లాడి సందేహాలను నివృత్తి చేశారు. అంతకుముందు భూముల రీసర్వే పలు అంశాలపై గ్రామ సచివాలయంలో రెవెన్యూ, సర్వే సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ జ్యోతిర్మయి, డిప్యుటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని పార్క్ రోడ్డు, సోమప్ప సర్కిల్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో నిరంతర పారిశుధ్య పనులతో పాటు డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడా లోపం లేకుండా ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నామన్నారు. పట్టణ వాసులు కూడా స్వచ్ఛపట్టణంగా మార్చేందుకు పారిశుధ్య కార్మికులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



బోరుకు మోటారును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మన్న

కోసిగి: మండల పరిధిలోని నేల కోసిగి గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరుకు ఎమ్మెల్యే వై. బాలనాగి రెడ్డి సహకారంతో రిపేరు చేయించినట్లు గ్రామ సర్పంచ్ పశువుల హనుమంతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మన్న తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి బోరు చెడిపోయింది. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎంపీపీ ఈరన్నతో మాట్లాడి మండల గ్రాంటు కింద బోరుకు కొత్త మోటారు ఏర్పాటు చేసి, యథావిధిగా తాగునీటి సరఫరా చేయించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు, ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడులు



సారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: పట్టణంలోని రణమండల కొండల్లోని నాటుసారా స్థావరంపై మంగళవారం ఎక్సైజ్ సీఐ సైదుల్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాల్మీకి నగర్‌కు చెందిన బోయ కార్తీక్ అనే వ్యక్తి నాటుసారా కాస్తున్నట్లు గుర్తించామని ఎక్సైజ్ సీఐ తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, బోయ కార్తీక్‌పై కేసు నమోదు చేశామన్నారు. కాగా.. తమను చూసి బోయ కార్తీక్‌ను పరారయ్యాడని చెప్పారు.

రోడ్డును బాగుచేయండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణం నుంచి కోసిగి ప్రధాన రహదారిలోని కమ్మలదిన్నె గ్రామం వరకు శిథిలమైన రోడ్డును బాగు చేయాలని సీపీఐ మంత్రాలయం నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్, ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఏఈ విజయ్‌నరేష్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో ఆటోల క్లచ్‌ప్లేట్లు విరిగిపోతూ, టైర్లు పగిలిపోతూ ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోతున్నాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మందగల్లు, వీరేష్, సుధాకర్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

కంది పంటకు నిప్పు



కాలిపోయిన కంది పంట

కోసిగి: మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామానికి చెందిన సుదర్శన రైతుకు చెందిన కంది పంటకు సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రైతు తెలిపిన వివరాల మేరకు.. రెండు ఎకరాల పొలంలో సాగు చేసుకున్న కంది పంటను కోసి గట్టున ఆరబెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు కోసి ఆరబెట్టిన పంటకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. సోమవారం ఉదయం వెళ్లి చూసే సరికి బూడిద మాత్రమే మిగిలి ఉందని బాధిత రైతు తెలిపారు. మొత్తం రూ. 2లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

సంక్రాంతి పాయే..

శివరాత్రి వచ్చె!

- అధ్వానంగా ఎమ్మిగనూరు – కోసిగి రహదారి
- సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తామని గతంలో సీఎం ప్రకటన
- శివరాత్రి వచ్చినా మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రయాణికులకు, విద్యార్థులకు తప్పని అవస్థలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం



పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో గుంతలమయమైన కోసిగి ప్రధాన రోడ్డు





శిథిలమైన కోసిగి ప్రధాన రహదారి

ఎమ్మిగనూరుటౌన్: సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. స్వయానా సీఎం చంద్రబాబునాయుడే ఈ ప్రకటన చేశారు. రహదారుల మరమ్మతులు, నూతన రహదారులంటూ కూటమి నాయకులు అన్ని ప్రాంతాల్లో తెగ హడావుడి చేశారు. కానీ సంక్రాంతి పోయి శివరాత్రి వచ్చినా క్షేత్ర స్థాయిలో గ్రామీణ రోడ్ల దుస్థితి మాత్రం మారడంలేదు. అధికారంలోకి వచ్చి 8నెలలు గడిచినా శిథిలమైన ప్రధాన రహదారులు కనీసం మరమ్మతులకు సైతం నోచుకోలేదనడంలో సందేహం లేదు.

శిథిలమైన కోసిగి రహదారి

ఎమ్మిగనూరు పట్టణం నుంచి కోసిగికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారయ్యింది. సీఎం ప్రకటనతో ఈ రహదారి పునర్నిర్మాణం లేదా కనీసం మరమ్మతులైనా సంక్రాంతి నాటికి బాగుపడతాయని ఆ రూట్‌లో వెళ్లే గ్రామీణులు, విద్యార్థులు ఎంతో ఆశపడ్డారు. అయితే సంక్రాంతి పండుగ పోయింది. శివరాత్రి వచ్చినా ఈ రోడ్డు మాత్రం కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మిగనూరు నుంచి కోసిగికి ,ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉరుకుందకు భక్తులు వెళ్లాలంటే ఈరోడ్డే దిక్కు. నిత్యం ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు ఇలా అన్ని వాహనాలు వందలాది సంఖ్యలో రాకపోకలు సాగుతుంటాయి. ఈరోడ్డు మీదుగా పట్టణానికి వచ్చే వెళ్లే విద్యార్థి బస్సులు సమయానికి చేరుకోకపోతుండటంతో విద్యార్థుల అవస్థలు వర్ణాతీతంగా మారుతున్నాయి.

28 కిలోమీటర్లు.. గంటన్నర ప్రయాణం

ఎమ్మిగనూరు నుంచి 28 కిలోమీటర్ల దూరంలో వున్న కోసిగికి ఈ రహదారిపై వెళ్లాలంటే గంటన్నరకు పైగా సమయం పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. శిథిల రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఎక్కడ వాహనాలు మరమ్మతులకు గురై ఆగిపోతాయోనని భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు, ప్రయాణికులు, ఉద్యోగులు వ్యయప్రయాసాలతో మంత్రాలయం మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కనీసం ఈ రోడ్డుకు శాశ్వత మరమ్మతులైనా చేయాలని లేద కొత్త రోడ్డును నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా?



ఎమ్మిగనూరు నుంచి కోసిగి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా శిథిలమైనా ప్రభుత్వం, ఆర్అండ్‌బీ అధికారులు మరీ ఇంత నిర్లక్ష్యం వహించడం శోచనీయం. విద్యార్థి బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో సమయానికి పాఠశాలలు, కళాశాలలు, ఇళ్లకు విద్యార్థులు వెళ్లలేకపోతున్నారు. బస్సు లేని సమయంలో ఆటోల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణించే దుస్థితి నెలకొంది. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా కనీసం రోడ్డు మరమ్మతులైన చేపట్టాలి.

– మహేంద్రబాబు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి

కేవలం ప్రకటనకే పరిమితం



సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు అని సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ కేవలం ప్రకటనకే పరిమితమైంది. వందలాది వాహనాల రాకపోకలు సాగించే కోసిగి రోడ్డు దుస్థితి ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియదా. ఇలాంటి రోడ్డును మొదటి ప్రాధాన్యతగా తీసుకొని మరమ్మతులైనా చేపట్టాల్సింది. వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగ ఉపాధ్యాయులు, గ్రామీణుల రాకపోకలు సాగించే ప్రధాన రహదారినే విస్మరిస్తే ఎలా?. ప్రమాదాలు జరిగితే అధికారులు, ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

– వీరేష్‌యాదవ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

సేవాభావంతో విధులు నిర్వర్తించాలి



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ మధుసూదన్‌రావు

నందవరం : గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తులకు సేవ భావంతో సేవాలందించాలని, వారి భద్రతే ముఖ్యమని డీఎస్పీ ఉపేంద్రబాబు పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని గురజాల క్షేత్రంలో సీఐ మధుసుదన్ రావు ఆధ్వర్యంలో భక్తుల కలిగించే భద్రతపై సిబ్బందికి డీఎస్పీ సలహాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ..భక్తుల భద్రత కోసం 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించమన్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా క్యూలైన్లు, నదీతీరంలో పుణ్యస్నానాలు, డ్రస్సింగ్ రూములు, దర్శన క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, ప్రసాద కౌంటర్ల వద్ద నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏపీజీబీని అమరావతికి తరలిస్తే ఊరుకోం

పెద్దకడబూరు: ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలిస్తే చూస్తూ ఊరుకునేదే లేదని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతుసంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు పరమేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఏపీజీబీ శాఖ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ బ్యాంక్‌లతో పోటీపడి డెబిట్ కార్డు, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్ ఇలా తదితర అన్ని సేవల్లో మంచి ఫలితాలను సాధించిందన్నారు. రాష్ట్రంలో గ్రామీణ బ్యాంక్‌ల మొత్తం వ్యాపారంలో 43శాతం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ కలిగి ఉన్నదన్నారు. ఇతర బ్యాంక్‌ల కంటే అధిక కష్టమర్లు (దాదాపు 86.75లక్షల మంది)ను కలిగి ఉందన్నారు. ఇలాంటి బ్యాంక్‌ను రాయలసీమ నుంచి తరలిస్తామనడం భావ్యం కాదన్నారు. అనంతరం వినతిపత్రాన్ని బ్యాంక్ సిబ్బందికి సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరన్న, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: గ్రామీణ బ్యాంక్‌ల ప్రధాన కార్యాలయాని వైఎస్సార్ జిల్లాలోనే కొనసాగించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, ఖాతదారులు కోరారు. మంగళవారం కోసిగి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరేష్, హనుమంతు, గోపాల్, చినన్న, నూర్ భాషా, రామాంజినేయులు ఉన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించవద్దని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదుట ఖాతాదారులతో కలసి నిరసన వ్యక్తం చేశారు.

బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంచాలి



కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎంఈఓ మెయినుద్దీన్

కోసిగి: అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు విద్యాభ్యాసంపై ఆసక్తి పెంచేలా కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈఓ–1 మెయినుద్దీన్, ఎంఈఓ – 2 శోభారాణి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన ఆరు రోజుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. వారు మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యపై ఆసక్తి కలిగేలా చిన్నారులకు ఆట పాటలతో ఉత్సాహం పెంచేలా బోధన చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్స్ కె.నరసయ్య, ఎన్. మనోహర్, ఈరన్న, ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ భాగ్యలక్ష్మీ బాయి, కాత్యాయినిలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యకర్తలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

నందవరం : అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎంఈఓ–1, –2 సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్ చేతుల మీదుగా శిక్షణ తరగతులకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, గురుశేఖరమ్మ, సురేఖ పాల్గొన్నారు.

గోనెగండ్ల : అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటలు, పాటల రూపంలో అర్థమయ్యేలా విద్యా బోధన చేయాలని ఎంపీడీఓ మణి మంజరి, ఎంఈఓ నీలకంఠ సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ లో నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు చివరి రోజు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.


కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ఆదోని టౌన్: బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అధికారులు, బ్యాంకర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీలు, ఐబీసీలు, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు సంబంధించిన లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు కోసం బ్యాకర్లు దరఖాస్తులను పరిశీలించారు. మొత్తం 98 యూనిట్లు మంజూరు కాగా, 2,300 మంది దరఖాస్తు చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. చైర్‌పర్సన్ శాంత, ఐకేపీ, మెప్మా ప్రాజెక్టు పట్టణాధికారి శ్రీనివాసులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కౌతాళం: బీసీ కార్పొరేషన్ కింద వివిధ రకాలైన రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్బా రాజు అధ్యక్షతన కౌతాళంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, వారి సిబ్బంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మండలంలో మొత్తం 51 యూనిట్‌లు ఉండగా 533మంది దరఖాస్తు చేసుకున్నారు.

నందవరం : బీసీ కార్పొరేషన్ కింద రుణాలకు దరఖాస్తు చేసుకున్న ఎంపీడీఓ పుల్లయ్య, ఏపీజీబీ, ఎస్‌బీఐ, కేనరా బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి 50 యూనిట్లకు గానూ 528 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా 372 మంది హాజరైనట్లు వెల్లడించారు.

పెన్సిల్ మొనపై అతిచిన్న శివలింగం



శ్రావ్య



శివలింగాన్ని పెన్సిల్ ముక్కపై వేసిన దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని అలసందగుత్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని హెచ్.శ్రావ్య మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కలర్ పెన్సిల్ ముక్కపై 0.5 సెం.మీ. కలిగిన అతిచిన్న సూక్ష్మ శివలింగ ఆకృతిని తయారు చేసి అబ్బుర పరిచింది. ప్రత్యేక శిక్షణతో ఈ సూక్ష్మ కళాకృతిని చేసినట్లు తెలిపింది. సూక్ష్మ కళను తయారు చేయడానికి గంట సమయం పట్టిందని విద్యార్థిని తెలిపింది. హెచ్‌ఎం గిరిజాదేవి విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు.

డెంగీ కేసు నమోదు

పెద్దకడబూరు: మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలో ఐదేళ్ల చిన్నారికి డెంగీ నిర్ధారణ కావడంతో మంగళవారం ఉదయం జిల్లా మలేరియా అధికారి నూకరాజు, స్థానిక వైద్యురాలు ఫిరదౌస్, ఈఓపీఆర్డీ జయరాముడు నౌలేకల్లు గ్రామం చేరుకున్నారు. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు పరిశీలించారు. బాధితురాలి కుటుంబసభ్యులకు తగు సూచనలు ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రుణాలు అర్హులకే ఇవ్వాలి

పెద్దకడబూరు: బీసీ కార్పొరేషన్ రుణాలు అర్హులైన నిరుద్యోగులకే ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హులైన బీసీలకు కాకుండా రాజకీయ నాయకుల తొత్తులకు బీసీ కార్పొరేషన్ రుణాలు అందేలా సంబంధిత అధికారులు చొరువ చూపుతున్నారని మండిపడ్డారు. దీంతో అర్హులైన నిరుద్యోగులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓ నాగరాజుస్వామికి సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరాంజినేయులు, తిక్కన్న, డోలు హనుమంతు, రెక్కల గిడ్డయ్య, నరసింహులు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశభవనంలో ఈనెల 28న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు మంగళవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు ఉరుకుందలో రుద్రాభిషేకం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద బుధవారం మహాశివరాత్రి పర్వదినానికి పురస్కరించుకుని మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేపడుతున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. రుద్రాభిషేకాన్ని రాత్రి 10గంటలకు గర్భాలయంలో ఏర్పాటు చేశామన్నారు. అభిషేకంలో పాల్గొనే వారు దేవస్థానంలో పేర్లను నమోదు చేసుకుని రశీదు పొందలని చెప్పారు. రుద్రాభిషేకంలో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫొటో, దేవస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం బాక్స్‌లో రెండు లడ్డూలు ఉంచి ఇవ్వనున్నట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనకు కార్యాచరణ

పెద్దకడబూరు : పురుగుమందులు వాడకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రదర్శించేదుకు కార్యాచరణ రూపొందిస్తామని ఏఓ ఎం.వరప్రసాద్ తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలో పైరయ్య ఆంజనేయస్వామి గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కషాయాలు, ద్రావణాలను తయారు చేసే విధానాము గురించి నిర్వాహకుడు అనిల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నాడు.

చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: మండలం, పట్టణ పరిధిలో ఇటుకల బట్టీలపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర ఆరోపించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు వీరేష్, నరసింహులు, వీరాంజినేయులు, శివ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 18 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహబుబ్‌బాషా తెలిపారు. మేళాలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు వారి కంపెనీల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. 34మంది యువతీ, యువకులు హాజరవగా వారిలో 18మంది ఆయా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో ఐదుగురు ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ న్యూటన్ రాజ్, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీల వెంకటశేషాద్రి

ఆదోని రూరల్: డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీల వెంకటశేషాద్రి మంగళవారం ఆదోని పట్టణంలోని సబ్‌జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులోని ఖైదీల బరాక్స్, రేషన్ స్టోర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముద్దాయిలకు ఉచిత న్యాయవాది కల్పించే వెలుసుబాటు ఉందని, ఆర్థిక స్థోమత లేని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ తరఫున ఉచిత న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, కారాగార సిబ్బంది, కోర్టు సిబ్బంది, అడ్వకేట్స్ పాల్గొన్నారు.

పోస్టుమార్టం చేయాలని ఆందోళన



ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

ఆదోని టౌన్: మద్దికెరకు చెందిన నెట్టికంటయ్య శవానికి పోస్టుమార్టం నిర్వహించి తమకు అప్పగించాలని కోరుతూ మంగళవారం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద బంధువులు ఆందోళన చేశారు. నెట్టికంటయ్య ఈనెల 24వ తేదీన మద్దికెర నుంచి ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామంలో శుభకార్యానికి వెళ్లి..అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శవాన్ని పరిశీలించిన డాక్టర్లు బాడీ కుళ్లిపోయిందని, పోస్టుమార్టం చేయలేని స్థితిలో ఉందని, కర్నూలుకు వెళ్లాలని సూచించారు. దీంతో మృతుడి బంధువులు తాము కర్నూలుకు వెళ్లలేమని, ఇక్కడే పోస్టుమార్టం చేసి అప్పగించాలని కోరుతూ ఆసుపత్రి ముందు ఆందోళన చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేవిశెట్టి ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అటు డాక్టర్లు పద్మకుమార్, అనిల్‌కుమార్‌తో పాటు మృతుడి బంధువులతో చర్చించారు. శవానికి పోస్టుమార్టం చేసి వైద్యులు బంధువులకు అప్పగించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

కొలిచే వారి కొంగుబంగారం..

పులిగట్టు ఆంజనేయస్వామి

- ఎరిగేరి గ్రామంలో శివరాత్రి ఉత్సవాలు ప్రత్యేకం
- నేడు కొండపైకి స్వామివారు
- ఐదురోజులపాటు గ్రామంలో మద్యం నిషేధం



దేవాలయంలో పుష్పాలంకరణ



కొండపైకి తరలివెళుతున్న భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధిగా చెందిన ఆంజినేయ స్వామి దేవాలయాల్లో ఒకటి పులిగట్టు ఆంజినేయ స్వామి దేవాలయం. ఎరిగేరి గ్రామానికి కిలోమీటర్ దూరంలో కొండపై వెలసిన స్వామి కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్నాడు. ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా ఇక్కడ స్వామి వారికి ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకం.

వందల ఏళ్ల క్రితం కొండపై ఆలయం

వందల ఏళ్ల క్రితం ఎరిగేరి గ్రామం, ఆలయం కొండపైనే ఉండేదని, అక్కడ పులులు సంచరిస్తుండగా ఈ స్వామి గ్రామాన్ని రక్షించేవాడని పెద్దలు చెబుతారు. అయితే కాలక్రమేణ అక్కడి వారంత కిందకు వచ్చి ఎరిగేరి గ్రామం ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికి కొండపై ఇళ్ల ఆనవాళ్లు ఉన్నాయి. అప్పటి నుంచి ఈ స్వామిని పులిగట్టు ఆంజినేయస్వామిగా కొలుస్తున్నట్లు గ్రామ పెద్ద దేవాలయ నిర్వాహకులు నీలకంఠరెడ్డి తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలే స్వామి ఉత్సవాలు

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈస్వామి ఉత్సవాలను నిర్వహించడం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. శివరాత్రి రోజు బుధవారం స్వామి పల్లకీని దేవుని కట్టా నుంచి రాత్రి కొండపైకి తీసుకెళ్లి అక్కడ జాగరణ చేసి భజనలు, వివిధ కార్యక్రమాలు పూర్తి చేసి గురువారం భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. ఈ రోజు భక్తులు స్వామికి పిండి వంటలు వండి నైవేద్యం సమర్పిస్తారు. శుక్రవారం సాయంత్రం పల్లకీ మహోత్సవం కార్యక్రమం ప్రారంభం అవుతుందని, కొండపై సాయంత్రం ప్రారంభమైన కార్యక్రమం శనివారం ఉదయం 10గంటల వరకు సాగుతుందని, యథాస్థితిలో దేవునికట్ట వద్ద స్వామి పల్లకీ రావడంతో ఉత్సవం ముగుస్తుందని నిర్వహకులు తెలిపారు. ఇప్పటికే గ్రామం ముఖ ద్వారం నుంచి కొండపైకి వరకు విద్యుత్ దీపాలతో రహదారి అంత సుందరంగా అలంకరించారు.

మందు ముట్టరు.. అమ్మరు

శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు ఈగ్రామంలో ఎవరు కూడా మందు ముట్టారు. స్వామి పల్లకీ మహోత్సం జరిగి దేవుడు దేవుని కట్టా వద్దకు చేరే వరకు ఈగ్రామంలో మందు (మద్యం) నిషేదం, మందు తాగరు.. అమ్మరు కూడా గ్రామంలో ఈ ప్రత్యేకత ఎన్నో ఏళ్ల నుంచి వస్తోంది.

ప్రతి ఇంట్లో ఆంజనేయస్వామి..

ఈ గ్రామంలో ఎవరింట్లో అయిన ఆయన నామామే కనిపిస్తుంది. ప్రతి ఇంట్లో ఆయన పేరును కచ్చితంగా పెట్టుకుంటారు. అంజి, ఆంజినేయ, హనుమంతు, మారుతీ, రామాంజినేయులు ఇలా.. ఈ గ్రామంలో ఇలాంటి పేర్లే అధికంగా ఉంటాయి.